

నిత్యకల్యాణం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కమనీయంగా సాగింది.



కేకే లైన్‌లో తనిఖీలు
విశాఖ: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం మనోజ్ శర్మ కేకే లైన్లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు జరిపారు.

వాతావరణం
అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు 34.1 నుంచి 34.2 డిగ్రీలు, గాలిలో తేమ 70 నుంచి 74 శాతం నమోదవుతాయని, గాలి గంటకు 2 నుంచి 5 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని తెలిపారు.

న్యూస్‌రీల్

అత్యవసర సేవలపై ఆరా తీసిన వైద్య నిపుణులు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ దీపక్‌నాందే డాంగేర్

అనకాపల్లి టౌన్: జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు (ఎన్‌క్యూఏఎస్) బృందం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో అత్యవసర వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించింది. తొలి రోజు మాతా శిశు వార్డును పరిశీలించిన బృందం సభ్యులు డాక్టర్ కె.నారాయణ (కేరళ), డాక్టర్ దీపక్‌నాందే డాంగేర్ (నాగపూర్), డాక్టర్ సవిత (ఢిల్లీ) రెండో రోజైన మంగళవారం అత్యవసరమైన విభాగాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. బుధవారం రికార్డులను పరిశీలించిన తరువాత ఎన్‌క్యూఏఎస్‌కు నివేదికను అందజేయనున్నట్లు వారు చెప్పారు. కొత్త జిల్లాలో రోగులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వైద్యులు, సిబ్బంది కొరత సమస్యను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు వైద్యాలయం సూపరింటెండెంట్ కె.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో భారతి, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

20 నుంచి ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాలులో ఈ నెల 20, 21, 22 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలకు వరకు ఈ నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఈ పంట నమోదు శతశాతం పూర్తి

- రైతుల ఈ కేవైసీ నమోదు 73.3 శాతం

అనకాపల్లిటౌన్ : జిల్లాలో ఈ–పంట నమోదు ప్రక్రియను శతశాతం పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని వెంకుపాలెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2022–23 సంవత్సరానికి గాను 43,116 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. మరోవైపు ఈకేవైసీ చురుగ్గా సాగుతోందన్నారు. ఇప్పటి వరకు ఈకేవైసీ 73.3 శాతం పూర్తయిందన్నారు. ఈ పంట ముసాయిదా జాబితాను జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద ఇప్పటికే(మార్చి 10న) ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ జాబితాను ఈ నెల 13 నుంచి 17 వరకు సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపిస్తారని, రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే సామాజిక తనిఖీ ద్వారా సవరణ కోసం నివేదించుకోవచ్చన్నారు.

జనన, మరణ ధ్రువపత్రాల జారీ పరిశీలన



ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న సెన్సస్ డైరెక్టర్

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సెన్సస్ (జనాభా లెక్కలు) డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పి.బాలకిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ వై.జగన్నాథపూరి మంగళవారం సందర్శించారు. జిల్లాలో జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు, శిశు ఆధార్ ధ్రువీకరణ పత్రాల జారీని పరిశీలించారు. డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లకోటు ధరించడంలో సడలింపు

విశాఖ లీగల్: వేసవి దృష్ట్యా న్యాయవాదులకు నల్లకోటు ధరించడంలో స్వల్ప సడలింపు లభించింది. ఈ మేరకు రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ఈనెల 15వ తేదీ నుంచి జూలై 15 వరకు కోటు ధరించడంలో సడలింపు ఇచ్చారు. న్యాయవాదులు ప్రతిరోజు తెల్ల ప్యాంటు, నలుపు, గ్రే కలర్ ప్యాంట్‌లను ధరించవచ్చని తెలిపారు. ఈ నియమాన్ని అన్ని దిగువ కోర్టులకు వర్తిస్తుందని కార్యదర్శి పేర్కొన్నారు.

విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లాలో 34 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 29,517 మంది విద్యార్థులు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

హెల్ప్‌లైన్ నంబర్
0891-2567561



సాక్షి, అనకాపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, రెండో సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 29,517 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో 13,281 మంది ఫస్టియర్, 16,236 మంది సెకండియర్ విద్యార్థులు ఉన్నారు. వీరి కోసమని 34 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆర్‌ఐవో కార్యాలయంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

ఆర్‌ఐవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్
పరీక్షల విషయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు విశాఖపట్నం కేంద్రంగా ఆర్‌ఐవో కార్యాలయంలో హెల్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు హెల్ప్‌లైన్ నంబర్ 0891–2567561కు ఫోన్ చేసి.. సమస్యను తెలపవచ్చు. విద్యార్థులు కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. హాల్ టిక్కెట్ చూపించి, విద్యార్థులు రాను, పోనూ ఉచితంగానే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు, ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించరు.

ప్రత్యేక తనిఖీ బృందాలు
పరీక్షల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్‌ఐ, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5 సిటింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.



సబ్బవరంలోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న విద్యాధికారులు

పకడ్బందీగా పరీక్షలు



అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. పరీక్ష సమయాల్లో ఆర్టీసీ బస్సు సర్వీస్ అందుబాటులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేస్తూ.. సమీపంలోని జెరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకున్నాం. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించాం. ఇంటర్ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు.
– రవి పట్టాన్‌శెట్టి, జిల్లా కలెక్టర్

ఏర్పాట్లు పూర్తి



మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. మంచినీటి సదుపాయం, టాయిలెట్ల సౌకర్యం ఏర్పాటు చేశాం. విధి నిర్వహణలో ఉన్న ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ సభ్యులు, పోలీసులు, వైద్య సిబ్బంది.. ఎవరి వద్ద మొబైల్ ఫోన్లు ఉండకూడదు. ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశించిన సమయాల్లో చీఫ్ సూపరింటెండెంట్ దగ్గర మాత్రమే సెల్‌ఫోన్ ఉంటుంది. విద్యార్థులకు ఆల్ ద బెస్ట్.
– సుజాత, జిల్లా వృత్తి విద్యాధికారి

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి



శంకర విజయేంద్ర సరస్వతికి పూర్ణకుంభ స్వాగతం

- శంకర విజయేంద్ర సరస్వతి స్వామి
- నర్సీపట్నంలో ఘన స్వాగతం
- శోభాయాత్రతో భక్తుల పరవశం



దుర్గా దేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి

నర్సీపట్నం: సనాతన ధర్మం పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పేర్కొన్నారు. అనుగ్రహ పర్యటనలో భాగంగా మంగళవారం స్వామి నర్సీపట్నం చేరుకున్నారు. శ్రీదుర్గామల్లేశ్వరిస్వామి ఆలయ కమిటీ వారు, అధికారులు, ప్రముఖ వైద్యులు రాజశేఖర్, లక్ష్మీకాంత్, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారు అమ్మవారిని దర్శించుకుని, గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు స్వామిని దర్శించారు. అనంతరం ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేక వాహనం నుంచి స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలతో స్వామి శోభయాత్ర అబిద్ సెంటర్ మీదుగా టీటీడీ కళ్యాణమండపం వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ధర్మాన్ని మనం పరిరక్షిస్తే.. ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. దిన చర్య సుప్రభాతంతో ప్రారంభం కావాలని, నిత్యం బొట్టుపెట్టుకొని, సాష్టాంగ నమస్కారం ఆచరించాలన్నారు. స్నానం చేసేటప్పుడు పవిత్ర గంగానదిని, భోజనం చేసేటప్పుడు అన్నపూర్ణ దేవిని స్మరించుకోవాలని సూచించారు. సనాతన ధర్మాన్ని అందరూ ఆచరించాలని, ధర్మ పరిక్షణ సాధన ద్వారానే సాధ్యమవుతుందని బోధించారు. గ్రామదేవతల జాతర్లు నిర్వహించాలన్నారు. భగవంతుడు ఇచ్చిన శరీరం ద్వారా ఇతరులకు ఉపకారం చేయాలని ఉద్బోధించారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఏపీలో వేద, సంగీత పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నామని స్వామి వారు పేర్కొన్నారు.

బావను చంపిన బావమరిదికి యావజ్జీవం

రూ.300 కోసం హత్య చేసిన రామ్‌నాథ్‌సింగ్



రామ్‌నాథ్‌సింగ్

యలమంచిలి/విశాఖ లీగల్ : రూ.300 కోసం క్షణికావేశంలో బావ మరణానికి కారణమైన బావమరిదికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు, రూ.2,500 జరిమానా విధిస్తూ విశాఖలోని 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు(నంద), యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు అందించిన వివరాలు..

యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ వద్ద బీహార్ రాష్ట్రం గయ జిల్లాకు చెందిన మృతుడు శైలేష్‌సింగ్ భార్య సునీతాదేవితో కలిసి ఒక దాబా నిర్వహించేవారు. శైలేష్ బావమరిది, నిందితుడు రామ్‌నాథ్‌సింగ్ కూడా రోజువారీ కూలీగా దాబాలో పనిచేసేవాడు. శైలేష్ తన వ్యక్తిగత పూచీతో నిందితుడికి రూ.30 వేలు అప్పుగా ఇప్పించాడు. ప్రతిరోజు సాయంత్రం ఫైనాన్స్ వారికి రామ్‌నాథ్‌సింగ్ జీతం నుంచి రూ.300 కట్టేవాడు. ఈ నేపథ్యంలో 2015 ఏప్రిల్ 20న శైలేష్ రూ.300 రామ్‌నాథ్‌కి ఇచ్చాడు. అయితే రామ్‌నాథ్ ఆ డబ్బులు ఎక్కడో పెట్టడంతో కనిపించలేదు. దీంతో శైలేష్ సింగ్ భార్య సునీతాదేవితో గొడవ పెట్టుకున్నాడు. అదే రోజు రాత్రి 9:30 గంటల సమయంలో దాబా పక్కనే ఉన్న, టైర్ల షాపులోకి వెళ్లి అక్కడ మహమ్మద్ ఇస్లాం సహకారంతో బలమైన ఇనుపరాడ్డును తీసుకుని శైలేష్ తలపై దాడి చేశాడు. అనంతరం ఆ రాడ్డుతో సహా బీహార్‌కు పారిపోయాడు. వెంటనే శైలేష్ భార్య అతనిని స్థానిక ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు విశాఖలోని కేజీహెచ్‌కి తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శైలేష్ మృతి చెందాడు. అప్పట్లో సంచలనం రేపిన ఈ కేసును అప్పటి యలమంచిలి గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ ఎ.వెంకట్రావు దర్యాప్తు చేశారు. నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 302 కింద కేసు నమోదుచేసి చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

చక్కని ఆరోగ్యంతో చదువుపై ఏకాగ్రత



విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్‌కుమార్

అనకాపల్లి టౌన్: జిల్లాలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం నులి పురుగుల నిర్మూలన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలలతో ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. స్థానిక నర్సింగరావుపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జిల్లా వైద్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ.హేమంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నులి పురుగులను నిర్మూలించడం ద్వారా రక్తహీనతను జయించవచ్చన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత చూపగలరన్నారు. అంతకుముందు విద్యార్థినితో డీ వార్మింగ్ మాత్రలు మింగించారు. భీమునిగుమ్మం అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో దివాకర్‌లు విద్యార్థులతో డీ వార్మింగ్ మాత్రలు మింగించారు.

ఉమ్మలాడలో..
మునగపాక: ఉమ్మలాడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్‌కుమార్ సందర్శించారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాణించాలంటే ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఏఎన్‌ఎం మరియారత్నం, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఆశ కార్యకర్తలు విజయకుమారి, వరలక్ష్మి, కావేరి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు

నేటి నుంచి మూడు చోట్ల నిర్ధారణ శిబిరాలు

చోడవరం రూరల్/అనకాపల్లి టౌన్: పద్దెనిమిదేళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం బుధవారం నుంచి జిల్లాలో వైద్య గుర్తింపు నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు ఎక్స్ అఫీషియో కోఆర్డినేటర్ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో బుధవారం, చోడవరంలో గురువారం, నర్సీపట్నంలో శుక్రవారం ఈ శిబిరాలు జరుగుతాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక అవసరాలైన వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ ఉచితంగా అందజేస్తారని చెప్పారు. బుధవారం అనకాపల్లిలోని ఉడ్‌పేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించే శిబిరానికి అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, మునగపాక, పరవాడ, యలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. గురువారం చోడవరంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగే శిబిరానికి చోడవరం, దేవరాపల్లి, సబ్బవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల, కె.కోటపాడు మండలాల దివ్యాంగ విద్యార్థులు, శుక్రవారం నర్సీపట్నంలోని జెడ్పీ హైస్కూల్ (మెయిన్)లో జరిగే శిబిరానికి నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ మండలాల నుంచి దివ్యాంగ విద్యార్థులు తమ సదరం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలలో హాజరు కావాలని ఆమె కోరారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడురోజులపాటు జరిగే ఈ శిబిరాలలో జిల్లాలోని 24 మండలాల దివ్యాంగ విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యోగాల పేరుతో టోపీ

- నిరుద్యోగులను నిలువునా ముంచిన టీడీపీ నేత
- ఏడేళ్ల క్రితం లక్షల్లో వసూలు
- చెల్లని చెక్కులు ఇవ్వడంతో లబోదిబోమంటున్న బాధితులు



మోసపోయిన నిరుద్యోగులు

బుచ్చెయ్యపేట: గ్రామ సర్పంచ్‌గా వెలుగు వెలిగాడు.. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి అనుచరుడిగా పేరొందాడు. అందుకే ఉద్యోగాలిప్పిస్తానంటే యువకులు అతన్ని నమ్మారు. అప్పోసొప్పో చేసి లక్షల్లో సమర్పించుకున్నారు. ఎనిమిదేళ్లవుతున్నా ఉద్యోగం రాకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలానికి చెందిన సీతా గణేష్, వడ్డాది గణేష్, తాటికొండ రమణ, తాటికొండ కాంతారావు స్నేహితులు. డిగ్రీలు చేసినా ఉద్యోగం రాక ఆందోళన పడుతున్న సమయంలో.. పోలేపల్లికి చెందిన టీడీపీ నేత సీతా వెంకటరమణ ఉద్యోగాలిప్పిస్తానంటే ఆశపడ్డారు. ఎనిమిదేళ్ల కిందట వెంకటరమణ సర్పంచ్‌గా ఉండడమే కాక టీడీపీకి చెందిన జిల్లా మంత్రికి అనుచరుడిగా ముద్ర పడడంతో ఆయనను ఆశ్రయించారు. సీతా గణేష్ ఒక్కడే రూ.10 లక్షలు ఇవ్వగా మిగిలిన వారంతా మరో పది లక్షల వరకు సర్పంచ్‌కు అందించారు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించక, తీసుకున్న డబ్బులు తిరిగివ్వక రేపు మాపు అంటూ తిప్పుతున్నాడని బాధిత యువకులు వాపోతున్నారు. గతంలో పలుసార్లు ఒత్తిడి తీసుకురాగా సర్పంచ్ చెక్కులు ఇచ్చాడన్నారు. అవి బ్యాంక్‌లో మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని బాధిత యువకులు కోరుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్క్‌లు!

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కులు ఏర్పాటయ్యాయి. వీటిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు విమానాశ్రయంలోకి ప్రవేశించే డిపాచర్ గేట్ల సమీపంలో రెండు సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కులను ప్రారంభించింది. ఇప్పటికే ఇలాంటివి రెండు కియోస్కులు ప్రీ–చెక్–ఇన్, చెక్–ఇన్ ఏరియాల్లో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కుల వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లే విమాన ప్రయాణికుల తనిఖీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

సెంటిమెంట్.. సేల్స్

- ఉపమాకలో మసాలా ఘుమఘుమలు
- తిరునాళ్లలో జోరుగా సుగంధ ద్రవ్యాల వ్యాపారం
- వెంకన్న సన్నిధిలో కొంటే ఏడాదంతా ఆరోగ్యం
- హోల్‌సేల్ ధరలకే నాణ్యమైన సరకులు



ఉపమాక తీర్థంలో విక్రయిస్తున్న సుగంధ ద్రవ్యాలు

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న తిరునాళ్లలో మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు స్వామివారి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అప్పటి నుంచి కొత్త అమావాస్య వరకు ఆలయం వద్ద పెద్ద ఎత్తున తీర్థ మహోత్సవం(తిరునాళ్లు) జరుగుతుంది. దీన్ని చూసేందుకు వివిధ ప్రాంతాలనుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ తిరునాళ్లు మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాల క్రయవిక్రయాలకు ప్రసిద్ధి.

భక్తుల నమ్మకంతో అమ్మకాల జోరు
వెంకన్న సన్నిధిలో లభించే పసుపు, కుంకుమతో పాటు సుగంధ ద్రవ్యాలు, నిత్యావసర సరకులు కొంటే ఇంట్లో తలపెట్టిన శుభకార్యాలు నిర్విఘ్నంగా జరుగుతాయని నమ్మకం. ఏడాది పొడవునా ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవిస్తామనేది భక్తుల విశ్వాసం. వ్యాపారులు కూడా ఇక్కడ ఏడాదికోసారి వ్యాపారం చేస్తే మిగిలిన రోజుల్లో వ్యాపారం బాగుంటుందని నమ్ముతారు. దీంతో అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, తుని, రాజమండ్రి, రాజవొమ్మంగి, రంపచోడవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, సరకులు విక్రయిస్తారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చేవారు ఇక్కడి సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేస్తుంటారు.



కొనుగోలుదార్లతో రద్దీగా దుకాణాలు

ఏడాదికి సరిపడా కొనుగోళ్లు

అన్ని మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు, పప్పుధాన్యాలు ఇక్కడ లభిస్తాయి. నిత్యావసర సరకులు కూడా అందుబాటులో ఉంటాయి. హోల్‌సేల్ ధరలకే వీటిని విక్రయిస్తుండటంతో ఏడాదికి సరిపోయేలా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. బయట కొనుగోలుకు ఇక్కడికి కిలోకు సుమారు రూ.50–100 వరకు వ్యత్యాసం ఉంటుందని కొనుగోలుదార్లు చెప్పన్నారు. దీనికితోడు నాణ్యత ఉంటుందని నమ్మకం. స్టీలు, ఇత్తడి, రాగి, ప్లాస్టిక్ వస్తువులు, మహిళల ఫ్యాన్సీ, అలంకరణ సామగ్రి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఏటా ఇక్కడి తిరునాళ్లలో రూ.కోటి విలువైన వ్యాపారాలు జరుగుతాయని అంచనా.

నాణ్యత.. నమ్మకం



చాలా ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్నాను. బయట మార్కెట్లో కంటే తక్కువ ధరలకే అందిస్తాం. నాణ్యత విషయంలో రాజీపడం. ఇక్కడ కొనుగోళ్లు భక్తుల సెంటిమెంట్‌తో కూడుకున్నవి. చాలా మంది ఏడాదికి సరిపడా సరుకుల్ని మా వద్దే కొనుగోలు చేస్తారు. ఏడాదిలో జరిగే ప్రతి శుభ కార్యానికీ వీటినే వాడతారు.
– కక్కిరాల శ్రీను, వ్యాపారి, ఉపమాక

స్వామి సన్నిధిలో కొనాలి



దాదాపు 30 ఏళ్ల నుంచి వెంకన్నస్వామి కల్యాణం చూడ్డానికి వస్తున్నాం. వచ్చిన ప్రతిసారీ ఇక్కడ ఏడాదికి సరిపడా సరుకులు కొంటాం. స్వామి గుడి దగ్గర కొనాలని సెంటిమెంట్. మా ఇళ్లల్లో జరిగే వివాహాది శుభకార్యాలకు వీటినే వాడతాం. మా పూర్వీకులు కూడా ఏటా ఇక్కడ సరుకులు కొనేవారట. ధరలు కూడా తక్కువే.
– సూర్యకాంతం, కొనుగోలుదారు, పెద్దాపురం

హౌస్‌ఫుల్

- హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన వన్డే మ్యాచ్ టికెట్లు
- ఎగబడ్డ అభిమానులు.. భారీగా క్యూలు



విశాఖ స్పోర్ట్స్: విశాఖకు క్రికెట్ ఫీవర్ వచ్చేసింది. భారత్–ఆస్ట్రేలియా సిరీస్‌లో భాగంగా ఈ నెల 19న వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగే డేనైట్ వన్డే మ్యాచ్ ఎప్పుడు చూసేద్దామా అని అభిమానుల్లో ఆతృత నెలకొంది. ఈ మ్యాచ్ వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ఇప్పటికే పూర్తి కాగా.. ఆఫ్‌లైన్‌లో మంగళవారం మూడు కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్, వెలంపేటలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియానికి పిల్లలతో సైతం టికెట్ల కోసం క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. బారికేడ్లు దూకేసి ఎగబడ్డారు. టికెట్లను పేటీఎం విక్రయించినా.. ఏర్పాట్లను మ్యాచ్ నిర్వాహక కమిటీ పర్యవేక్షించింది. టెంట్‌లతో పాటు మంచినీటి సౌకర్యం, బారికేడ్లను ఏర్పాటు చేసింది. కనీస ధర నుంచి అన్ని డినామినేషన్లలోనూ గంటల వ్యవధిలోనే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోవడంతో.. సోల్డ్ అవుట్ బోర్డులు వెలిశాయి. కాగా.. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునే వెసులుబాటును కల్పించారు. 19వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. వైఎస్సార్ స్టేడియంలో గత జూన్‌లో టీ20 మ్యాచ్ జరగ్గా, 2019 చివర్లో వన్డే మ్యాచ్ జరిగింది. భారత్‌కు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన వైఎస్సార్ స్టేడియం మరోసారి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో 27 వేల మంది అభిమానులతో కిక్కిరిసిపోనుంది.

11.30 గంటల నుంచే స్టేడియంలోకి...

మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం రెండు గంటల ముందు నుంచే స్టేడియంలోకి ఆయా ప్రవేశ ద్వారాల నుంచి ప్రేక్షకులను అనుమతించనున్నారు. మూడున్నర తర్వాత స్టేడియంలోకి అనుమతించరు. టికెట్లను అధునాతన టెక్నాలజీతో స్కాన్ చేసి ఆయా గేట్ల ద్వారా లోపలకు అనుమతిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. స్టేడియంలో ఉచితంగానే మంచినీటిని అందించనుండగా... వైద్య, ఆహారపు స్టాళ్లు, పార్కింగ్ ఏర్పాట్లకు అనువుగా వైఎస్సార్ స్టేడియం మరోసారి ముస్తాబవుతోంది.

పది పరీక్షలకు అబ్జర్వర్‌గా జ్యోతికుమారి



జ్యోతి కుమారి

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు సంబంధించి విశాఖ, అనకాపల్లి జిల్లాలకు అబ్జర్వర్‌గా విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారిని నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జ్యోతి కుమారి రెండు జిల్లాల్లో ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు. సార్వత్రిక విద్య విధానంలో జరిగే పరీక్షలకు కూడా ఆమె అబ్జర్వర్‌గా వ్యవహరించనున్నారు.

నాన్నే స్ఫూర్తి...

- అణా నుంచి పైసా వరకు సేకరణ
- వరించిన పలు రికార్డులు
- తండ్రి అభిరుచిని కొనసాగిస్తున్న కొణతాల శ్రీనివాసరావు



INDIAN BOOK of RECORDS

Indian World Record

THIS CERTIFICATE IS PROUDLY PRESENTED TO

Srinivasa Rao Konathala

On this Fifteenth Day of August, 2022


Special Recognition and Commendations are conveyed to Srinivasa Rao Konathala, who has unwavering commitment towards patriotism, by showing love, devotion and sense of attachment to a home land by being a part of the "Greatest number of people taking a selfie with Indian National Flag is 27369", achieved with passion towards National Pride to inspire, motivate and encourage on the eve of Independence Day Celebrations. Srinivasa Rao Konathala, is being a part of the "Azadi Ka Amrit Mahotsav" 75th Year of Independence with the Theme "Har Ghar Tiranga" achieved a new "Indian World Record", adjudicated by Dr. GVNRSSS Vara Prasad, Advocate, Supreme Court of India, at Hyderabad, Telangana, India.

Dr. Vivekananda Babu K
Founder Editor
INDIAN BOOK OF RECORDS
THE KEEPER OF THE INDIAN RECORDS


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు సర్టిఫికెట్

అనకాపల్లి టౌన్: నాణేలను సేకరించే అభిరుచి ఉన్న వారు అరుదుగా కనిపిస్తుంటారు. ఇది వారికి ఒక చక్కని హాబీ. గత కాలపు వైభవాలకు, పాలనకు సాక్షీభూతాలుగా నిలుస్తున్న వీటిని సేకరించి అపురూపంగా భద్రపరుస్తుంటారు. అటువంటి కోవకు చెందిన వారే కొణతాల శ్రీనివాసరావు. తన తండ్రి అభిరుచిని కొనసాగిస్తున్న అతనిది అనకాపల్లిలో గవరపాలెం. తన జీవనోపాధి నిమిత్తం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో వర్క్‌షాపు నడుపుతున్నాడు. తన తండ్రి నూకరాజు సైతం పాత నాణాలను సేకరించి ఒక డబ్బాలో ఉంచేవారు. ఆ తర్వాత ఆ అభిరుచిని 1950లో శ్రీనివాసరావు అందిపుచ్చుకున్నారు. అప్పటి నుంచి 2022 వరకు ఆర్‌బీఐ విడుదల చేసిన ఒక అణా నుంచి రూ.10 నాణెం వరకు సంవత్సరాల వారీగా సేకరిస్తూనే ఉన్నారు. స్వాతంత్య్రం వచ్చి ఇప్పటి వరకు ఆర్‌బీఐ గవర్నర్లుగా 22 మంది పని చేశారు. గవర్నర్ల సంతకాలతో కూడిన నోట్లు ఈయన సొంతం చేసుకున్నారు.

అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి గుర్తించిన 200 దేశాలకు చెందిన నాణేల్లో మన దేశం నాణాన్ని సేకరించారు. 1950 వరకు బ్రిటీష్ నాణేలు చెల్లుబాటులో ఉండేవి. ఆ తర్వాత రిపబ్లిక్ డే కాయిన్స్ అందుబాటులోకి వచ్చాయి. రిజర్వుబ్యాంకు 35 గ్రాముల సిల్వర్‌మెటల్ బరువుతో ధర కామెరేటివ్ నాణేలు ఇప్పటి వరకు 134 సెట్లు విడుదల చేసింది. అవి బయట సర్క్యులేషన్ రాకపోగా, అందులో రూ.10, రూ.20, రూ.25, రూ.50, రూ.175, రూ.200, రూ.250, రూ.350, రూ.500, రూ.550, రూ.1000 డినామిషన్ ఒక్కొక్కటి సేకరించారు. అంతేకాకుండా పోస్టల్ స్టాంప్స్, కవర్లు, మ్యాగ్జిస్‌కార్డ్స్, ఫస్ట్ డే కవర్స్ కూడా సేరించడం ఆయన అభిరుచిగా మలుచుకున్నారు.



రూ.175 కాయిన్ వెనుకభాగం



1, 2, 3 పైసలతో గ్రీటింగ్‌కార్డ్



పాత, కొత్త నోట్లు

కాయిన్స్, నోట్స్ ఎగ్జిబిషన్స్ :

విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌ల్లో జరిగే కాయిన్స్, నోట్స్ ఎగ్జిబిషన్లలో శ్రీనివాసరావు తన మిత్రుల నుంచి సేకరించారు. 000025 నంబర్ నోట్లతోపాటు రూపాయి, 2000 నోట్ల వరకు సేకరించినందుకు 2021లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, 2022లో ఇండియన్ వరల్డ్ రికార్డ్స్, 2022లో ఉత్తరప్రదేశ్ వరల్డ్ రికార్డ్‌తోపాటు పోస్టల్ ఏపీ విశాఖపట్నంలో జరిగిన ఎపెక్స్ గతేడాది సర్టిఫికెట్లు లభించాయి. ది నుమైసిమాటిక్ అండ్ పిహ్లాటిటిల్క్ సొసైటీ ద్వారా విశాఖ గాజువాక భాస్కర్ విద్యామందరితోపాటు అనకాపల్లి విద్యాధరి, డీఏవీ హైస్కూళ్లతో పాటు పశ్చిమ గోదావరి పాలకొల్లు లయన్స్ క్లబ్‌లలో విద్యార్థుల కోసం నాణేలు ప్రదర్శించారు.



1984-89 రూ.5 కాయిన్స్

నేటి తరానికి తెలియాలి...



నాటి చరిత్ర నేటి తరానికి తెలయాలన్న ఉద్దేశంతో నాణేల సేకరణ అభిరుచిని లక్ష్యంగా పెట్టుకున్నా. ది నుమైసిమాటిక్ అండ్ పిహ్లాటిటిల్క్ సొసైటీ ద్వారా స్కూళ్లు, కళాశాలల్లో ప్రదర్శించి వివరిస్తున్నా. అణా నుంచి పైసలు, రూపాయి వరకు విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ ప్రయత్నం.

– కొణతాల శ్రీనివాసరావు, అనకాపల్లి

దండికోనేరు అభివృద్ధి పనులు ప్రారంభం



సబ్బవరంలోని దండి కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సబ్బవరం: సబ్బవరంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆనుకుని ఉన్న దండి కోనేరు అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పనులను పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్నారు. కోనేరును అభివృద్ధి చేసి పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు పంచాయతీ పాలవర్గ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పార్కులో వాకింగ్ ట్రాక్, గార్డెన్, బెంచ్‌లు ఏర్పాటు చేసి ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. అవసరమైన నిధులు దాతల నుంచి విరాళాలు స్వీకరించి అభివృద్ధి చేపడతామని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఈవోఆర్‌డీ మహేష్, పంచాయతీ కార్యదర్శి కార్యమూర్తి, పాలకవర్గ సభ్యులు టి. శేఖర్, కొల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు టి.అర్జాపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

రావికమతం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని టి.అర్జాపురం హైస్కూల్ విద్యార్థులు మత్స భాగ్యశ్రీ, మలిచెట్ల భీష్మ నందిని, కలిగిరి భాగ్యలక్ష్మి, మరిశా కుమార్, ఆరి క్రాంతి, పడాల సాంబశివ ఎంపికయ్యారు. ఇటీవల ఇక్కడ హైస్కూల్‌లో అండర్ -19 జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పీపీ రమేష్‌నాయుడు మంగళవారం తెలిపారు. అక్కడా రాణించి విజేతలుగా తిరిగి రావాలని ఈ సందర్భంగా హెచ్‌ఎం కె.ఆర్.ఎస్.నాయుడు ఆకాంక్షించారు.

పదిలో సత్ఫలితాలు సాధించాలి

దార్లపూడిలో నైట్ స్టడీ అవర్స్‌ను పరిశీలించిన డిప్యూటీ డీఈవో



నైట్ స్టడీ అవర్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో సత్ఫలితాలు సాధించాల్సిందేనని యలమంచిలి డిప్యూటీ డీఈవో ఎస్. ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని దార్లపూడి ఉన్నత పాఠశాలలో నైట్ స్టడీ అవర్స్‌ను మంగళవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ స్టడీ అవర్స్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులను మెరుగ్గా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు తెచ్చుకునేలా మెలకువలు చెప్పాలన్నారు. స్నేహితులుగా మెలిగి ప్రణాళిక బద్ధంగా చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ క్రమంలో పలువురు విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో రాత్రి పూట చదివేందుకు కలిగిన ఆసక్తి అంశాలను తెలుసుకున్నారు. ఎంఈవో మూర్తి, హెచ్‌ఎం శాంతి ప్రసూన పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులతో సమావేశం

- అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఆర్వో

సీతంపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. మంగళవారం ఉదయం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్‌జైన్ సమక్షంలో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరు జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్‌జైన్ సమక్షంలో ర్యాండమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోగాపురం, గుర్ల, గుమ్మలక్ష్మీపురం, డెంకాడ, యలమంచిలి, ఆశీలమెట్ట, అక్కయ్యపాలెం, చంద్రంపాలెం, రాంబిల్లి తదితర పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం పీవో డైరీతో పోల్చి చూశారు. చివరి సమయంలో ఎక్కువగా ఓట్లు వినియోగించుకున్న పోలింగ్ కేంద్రాలు, టెండర్ ఓట్లు వివరాలు ఎన్నికల పరిశీలకులు తనిఖీ చేశారు. అనంతరం పోటీ చేసిన అభ్యర్థులు ఓటింగ్ సరళిపై తమ అభిప్రాయాలను అబ్జర్వర్స్‌కు వివరించారు. సమావేశంలో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, విజయనగరం ట్రైనీ కలెక్టర్ శ్రీఖర్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆరు జిల్లాల సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియంలో విస్తృత తనిఖీలు

- రంగంలోకి కే9 స్నిఫర్ డాగ్స్, బాంబు తనిఖీ బృందాలు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కసరత్తు



స్టేడియంలో తనిఖీ చేస్తున్న కే9 స్నిఫర్ డాగ్స్ బృందం

దొండపర్తి: భారత్–ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19న జరగనున్న వన్డే మ్యాచ్‌కు పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. అంతర్జాతీయ ఆటగాళ్లు, ఆట చూసేందుకు వచ్చే ప్రముఖులు, క్రికెట్ అభిమానుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. మ్యాచ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో పోలీస్ శాఖ స్టేడియాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి మైదానం, పరిసర ప్రాంతాల్లోను విస్తృత తనిఖీలు ప్రారంభించింది. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తనిఖీల కోసం సీపీ శ్రీకాంత్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కే9 స్నిఫర్ డాగ్స్ బృందాన్ని స్టేడియంలో తనిఖీల కోసం రంగంలోకి దింపారు. అడ్వాన్స్ యాంటీ సాబోటేజ్ చెక్ టీమ్స్, బాంబు తనిఖీ బృందాలతో క్రికెట్ పిచ్‌తో పాటు స్టేడియంలో అణువణువూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మైదానం లోపలే కాకుండా పార్కింగ్ ప్రదేశాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ స్టేడియాన్ని సందర్శించి నిఘా, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. డీసీపీ–1 సుమిత్ సునీల్ గరుడ్ స్టేడియం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలపై కసరత్తు చేస్తున్నారు.

భర్త చేతిలో భార్య హతం

తలపై రాడ్డుతో మోదడంతో మృతి



లత (ఫైల్)

బుచ్చెయ్యపేట: అనుమానమే పెనుభూతమై వారి పచ్చని కాపురంలో చిచ్చు పెట్టింది. అన్యోన్యంగా సాగిపోతున్న వారి దాంపత్యాన్ని ముక్కలు చేసింది. క్షణికావేశానికి లోనైన భర్త తన భార్య తలపై ఇనుప రాడ్డుతో మోదడంతో ఆమె మృతి చెందిన సంఘటన బుచ్చెయ్యపేట మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆర్.శివరాంపురానికి చెందిన భార్యాభర్తలు చందక నూకరాజు, లత వరసకు మేనమావ, మేనకోడళ్లు. నాలుగేళ్ల క్రితం వీరిద్దరికి కుటుంబ సభ్యులు వివాహం చేశారు. ఈ క్రమంలో కందిపూడి రెవెన్యూలోని తమ భూమిలో షెడ్డు వేసుకుని డెయిరీ ఫాం పెట్టుకుని పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తరుచూ ఇద్దరు అనుమానంతో గొడవలు పడేవారు. ఆదివారం సాయంత్రం వారి మధ్య తలెత్తిన గొడవలో నూకరాజు క్షణికావేశంలో తన భార్య తలపైన, ఒంటిపైన ఇనుప రాడ్డుతో ఇష్టానుసారంగా కొట్టడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు. మృతురాలి తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ అంబేడ్కర్ సమక్షంలో మంగళవారం కేజీహెచ్‌లో శవ పంచనామా చేశారు. పోస్టుమార్టం అనంతరం లత భౌతికాయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకులో ఉంచిన నగదు మాయం

- గంటల వ్యవధిలో దొంగల పట్టివేత
- చోరీ కేసును 12 గంటల్లో ఛేదించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం : చోరీ కేసును గంటల వ్యవధిలో ఛేదించామని డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చోరీ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన నగదు చోరీ మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో జరిగిందన్నారు. కాకినాడ జిల్లా, కోటనందూరు గ్రామానికి చెందిన చింతకాల లోవరాజు నిత్యావసర సరకుల హోల్‌సేల్ వ్యాపారి వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. లోవరాజు సోమవారం సరకులు సరఫరా చేసిన వ్యక్తుల నుంచి డబ్బులు వసూలుకు మోటార్ బైక్‌పై వచ్చాడు. నర్సీపట్నంలో దుకాణాలను చూసుకుని బైక్‌కు సైడు ఉన్న బాక్స్‌లో పెట్టుకున్నాడు. బలిఘట్టంలోని వ్యాపారి నుంచి డబ్బులు వసూలుకు లోపలికి వెళ్లాడు. ఇంతలో బాక్స్‌లో పెట్టిన రూ.9,56,000 మాయమయ్యాయి. లోవరాజు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రమణయ్య, ఎస్‌ఐ ధనుంజనాయుడు, గోవిందరావు టీమ్‌లుగా ఏర్పడి సీసీ ఫుటేజ్‌ల ద్వారా నిందితులు గొలుగొండ మండలం, కేడీ పేటకు చెందిన గంటా రవీంద్ర(30), కొత్తవలస, చీడివలసకు చెందిన మేకల ఎలియా కుమార్(18), బాల నేరస్థుడిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,36,000 నగదు స్వాధీనం చేసుకున్నామని, రవీంద్ర, ఎలియకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, వీరిద్దరూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అలాగే బాల నేరస్తుడిని విశాఖ జువైనల్ హోంకు తరలించామన్నారు. నిందితుడి వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్ సీజ్ చేశామని తెలిపారు.

క్లుప్తంగా

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ పట్ల ఆనందం



సాక్షి దినపత్రికతో సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ ప్లేస్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరిష్‌కుమార్, ప్రిన్సిపాల్ సునీత, చిట్టిపొట్టి చిన్నారులు ఆర్ఆర్ఆర్ చిత్రంలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు లభించడం పట్ల చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. స్కూల్ ఆవరణలో ‘సాక్షి’దినపత్రికను చిన్నారులు ప్రదర్శిస్తూ ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అమరజీవి జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు ఈ నెల 16 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అమరజీవి పొట్టి శ్రీరాములు భవన్ వ్యవస్థాపకుడు పీఎంఎల్ నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్ వద్ద పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి, కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు.

నేడు వాకర్స్ క్లబ్ సమావేశం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శంకర్ థియేటర్ సమీపంలో ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు స్వగృహంలో బుధవారం అనకాపల్లి వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ మంగళవారంతో ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్థోపెడిక్ వైద్యుడు దినేష్‌కుమార్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ

అనకాపల్లిటౌన్ : నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకో ఆర్డినేషన్ కమిటీని ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మంగళవారం ప్రకటించారు. పట్టణం నుంచి ఐఆర్ గంగాధర్, దాసరి సంతోష్‌కుమార్, తుట్టా రమణ, మండలం నుంచి కాళ్ల సత్యనారాయణ, కశింకోట మండలం నుంచి మలపరెడ్డి కోటేశ్వరరావులను కమిటీలో నియమించారు. కమిటీలో అవకాశం కల్పించినందుకు గంగాధర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
సీఎస్ఐ	సత్యనారాయణస్క్రీన్-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
వాల్తేరు వీరయ్య	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,067 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,490	4,150
మొదటి రకం	3,580	4,000
రెండో రకం	3,380	3,770
మూడో రకం	3,320	3,440

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఓ నెగిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కార్మిక నేస్తం.. ఈ శ్రమ్



ఈ శ్రమ్ పథకం గురించి కూలీలకు అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు



నమోదైన కూలీలకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న అధికారులు

- ఈ శ్రమ్ కార్డుతో అసంఘటిత కార్మికులకు భరోసా
- కార్మికుల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్
- నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

అనకాపల్లి రూరల్ : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రతతో పాటు సంక్షేమ పథకాలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. కార్మికులు ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకుంటే వారికి గుర్తింపు కార్డు మంజూరవుతుంది. దీంతో వారు పలు రకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుంది.

పట్టణంలో 3 వేలమంది నమోదు

అనకాపల్లి పట్టణంలోని జోన్-1, జోన్-2 సహాయ కార్మిక శాఖ కార్యాలయాల పరిధిలో 3 వేల మందికి పైగా కార్మికులు ఈ శ్రమ్‌లో నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకోనివారు సత్వరమే ఆయా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలను వెబ్‌పోర్టల్‌లో చేర్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 2021 ఆగస్టులో ఈ పోర్టల్‌ను ప్రవేశపెట్టగా, దీనిపై సరైన అవగాహన లేక పలు వర్గాల కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోలేకపోయారు. దీంతో అసంఘటిత రంగ కార్మికులకు ఈ శ్రమ్‌పై అవగాహన కల్పించేందుకు కార్మిక శాఖ చర్యలు చేపట్టింది.

ఈ శ్రమ్‌తో భరోసా

ఈ శ్రమ్ కింద నమోదు చేసుకున్న వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.2 లక్షలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష ప్రభుత్వ సాయం అందుతుంది. అసంఘటిత రంగంలో ఎంతమంది కార్మికులున్నారో ప్రభుత్వానికి ఓ స్పష్టత వస్తుంది. ఏదైనా అనుకోని పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ప్రభుత్వం తరఫున నేరుగా కార్మికుడికి సాయం అందించే వీలుంటుంది. దీంతోపాటు వీరికి అవసరమైన వృత్తి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రభుత్వానికి సులభతరమవుతుంది.

అర్హులు వీరే

ఉపాధి, భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారు, ఆటో, వ్యాన్, లారీ డ్రైవర్లు, స్వర్ణకారులు, చేనేత, కమ్మరి, కుమ్మరి, వలస, రిక్షా, చర్మకారులు, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, మత్స్యకారులు, పాడి రైతులు, ఇటుక బట్టీ కార్మికులు, క్వారీలో పనిచేసేవారు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, వార్తా పత్రికల విక్రేతలు, వీధి వ్యాపారులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, చిరువ్యాపారాలు చేసుకునే వారు ఈ శ్రమ్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. వీటితో పాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్ లేని చిరుద్యోగులు కూడా అర్హులే. ఇందులో నమోదు చేసుకునే వారి వయసు 16 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇలా దరఖాస్తు చేసుకోవచ్చు

ఈ శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబరు, బ్యాంకు ఆధార్ కార్డు లింకేజీ కలిగిన ఫోన్ నెంబరు ఉండాలి. సమీపంలోని పోస్టాఫీసు లేదా సీఎస్‌సీ సెంటర్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేస్తారు. కార్మిక శాఖ కార్యాలయాల్లో కూడా లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

కార్మికులకు ప్రయోజనకారి



ఇటువంటి బృహత్తరమైన పథకంలో సభ్యులుగా నమోదుకావడం వల్ల కష్టకాలంలో కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. ప్రమాదానికి గురైన వారిని ప్రభుత్వం ఈ పథకం ద్వారా సకాలంలో ఆదుకుంటుంది. బహుళ ప్రయోజనాలున్న ఈ పథకంలో చేరడానికి ఎలాంటి రుసుం చెల్లించనక్కర్లేదు. దీనిపై అసంఘటిత రంగ కార్మికులకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– కోరాడ నరేంద్ర, సహాయ కార్మికశాఖాధికారి, అనకాపల్లి-2

డీవార్మింగ్ లక్ష్యాన్ని చేరుకోవాలి



ఆల్బెండజోల్ మాత్రను విద్యార్థులకు అందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది

కశింకోట : నులి పురుగుల నివారణకు విద్యార్థులకు అందించే ఆల్బెండజోల్ మాత్రలను లక్ష్యం మేరకు పంపిణీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్ సిబ్బందిని ఆదేశించారు. కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ తీరును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివతో చర్చించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



తేగాడ కస్తూర్బా స్కూల్లో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట : మండలంలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నులి పురుగుల నివారణ(ఆల్బెండజోల్) మాత్రలను అందించారు. కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది దగ్గరుండి మరీ విద్యార్థులచే మాత్రలు మింగించారు. వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై ఆపద మిత్రలకు శిక్షణ



పీపీటీ ద్వారా విపత్తుల సమయంలో సహాయక చర్యల్ని వివరిస్తున్న ట్రైనర్లు

అనకాపల్లి రూరల్ : విపత్తులు సంభవించినపుడు ఆపద మిత్రలు సమయస్ఫూర్తితో స్పందించాలని ఎంపీడీవో కె.ధర్మారావు సూచించారు. విపత్తుల సమయంలో ఆపద మిత్ర వలంటీర్లంతా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. మండలంలోని సంపతిపురం హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్‌లో మగళవారం ఆపద మిత్ర వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తుపాన్లు, భూకంపాలు, భారీ వర్షాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు తదితర విపత్తులు సంభవించినపుడు ప్రజలకు సహాయక చర్యలు చేపట్టడానికి ఆపద మిత్రలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపత్తుల సమయంలో సహాయక చర్యలు ఎలా చేపట్టాలో ట్రైనర్లు వివరించారు. ఎప్పటికప్పుడు వలంటీర్లకు కొత్త నైపుణ్యాలపై శిక్షణ అందించడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 25 వరకూ ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో ఫ్యాకల్టీ మెంబర్ ఆంజనేయులు, హార్ట్‌ఫుల్‌నెస్ సభ్యులు, 50 మంది కమ్యూనిటీ, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛత వైపు ముందడుగు వేయాలి



మురుగు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

యలమంచిలి : స్వచ్ఛతకు పట్టణంలో ప్రజలందరూ ఒక అడుగు ముందుకేయాలని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో ప్రధాన రహదారిలో పక్కన గల మురుగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్తను పొక్లెయిన్ సహాయంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో తొలగింపజేశారు. ఈ పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించి సిబ్బందికి, దుకాణదారులకు సూచనలు అందించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాల వద్ద 144 సెక్షన్

సబ్బవరం : ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ కేశవరావు మంగళవారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు సబ్బవరంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సబ్బవరం గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 1415 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల్లో విద్యుత్ లైట్లు, తాగునీరు, సీసీ కెమెరాలు, వైద్య శిబిరం వంటి అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. బుధవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల పర్యవేక్షకుడిగా డి. కోటేశ్వరరావు వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు.

పెందుర్తిలో..

సింహాచలం : పెందుర్తిలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పలు కళాశాలల్లో ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు కళాశాలల్లో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 625 మంది, పెందుర్తి బాలాజీ జూనియర్ కళాశాలలో 610 మంది, రాజయ్యపేట సమీపంలోని డీఆర్‌జీ కళాశాలలో 474మంది, ఆర్ఆర్‌వెంకటరావురం వద్ద ఉన్న ఎస్‌వీఎల్ఎస్ కళాశాలలో 554మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర కార్యదర్శికి జరిమానా



అల్లిపురం: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్(ఎన్‌హెచ్ఆర్సీ) రాష్ట్ర కార్యదర్శికి మోటారు వాహనాల చట్టం ప్రకారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. అనకాపల్లికి చెందిన ఏఆర్‌జీ శాస్త్రి అలియాస్ నల్లబాబు ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం బీచ్‌రోడ్డులో తన స్కార్పియో వాహనంలో వెళ్తున్నారు. వాహనానికి ఎరుపు, నీలం రంగుల జిగ్‌జాగ్ లైట్లు, డిస్కో లైట్లు పెట్టుకుని వెళ్తుండడంతో.. ఏఎస్ బీచ్ ఆస్పత్రి వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపి అతన్ని ప్రశ్నించారు. డిస్కో లైట్లు పెట్టుకుని తిరగడం నేరమని చెప్పి మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా విధించారు.

సంపద తయారీ కేంద్రాలతో మేలు



మామిడివాడలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషరాణి

రాంబిల్లి : సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఎంతో మేలు జరుగుతుందని డీపీవో శిరీషరాణి అన్నారు. మామిడివాడలో మంగళవారం ఆమె పర్యటించారు. సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వీటిని సక్రమంగా నిర్వహించడం ద్వారా గ్రామాల్లో చెత్తాచెదారం వుండదని, ఈ చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారీ, అమ్మకం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం చెరువు గట్టుపై గల మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, ఈవోపీఆర్డీ రాజు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

17న వాహనాల వేలం

పాయకరావుపేట : ఈ నెల 17వ తేదీన వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం వేయడం జరుగుతుందని ఎస్ఈబీ సీఐ పి.టి.వి. కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 16 వ తేదీన ఎస్ఈబీ కార్యాలయంలో సంప్రదించి ధరావతు మొత్తం చెల్లించి 17న జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వాహనాలను వేలం ద్వారా పొందిన వారు మిగిలిన మొత్తంతోపాటు, జీఎస్టీ కూడా చెల్లించాలన్నారు.

నులిపురుగులతో ఎదుగుదల లోపం



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం : నులిపురుగులు ఉంటే పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో రమేష్ నాయుడు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి నులిపురుగుల నివారణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ పిల్లల్లో ఉండే నులిపురుగుల సమస్యను ప్రజా ఆరోగ్య సమస్యగా గుర్తించడం జరిగిందన్నారు. అవి జీవ పేగుల్లో ఇన్‌ఫెక్షన్‌కు గురిచేసి పిల్లల ఎదుగుదలతో పాటు వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటివి ఏర్పడతాయన్నారు. క్రమం తప్పకుండా నులిపురుగుల నివారణ మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ చిన్నమ్మాయి, ఎంపీహెచ్‌వో కె. జేసుదాసు, ఏఎన్ఎం టి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

17న నూకాంబిక ఉత్సవ విగ్రహ ఊరేగింపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా ఈ నెల 17న అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. గవరపాలెంలోని తన స్వగృహంలో అమ్మవారి ఊరేగింపు మహోత్సవ కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే అమ్మవారి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మవారి మాలధారుల సేవా సంఘం వ్యవస్థాపకుడు పొలిమేర శ్రీను, సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, సంఘం సభ్యులు మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కొలపర్తి శ్రీను, ఉదయ్, అక్షయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పండ్ల మొక్కలు



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్ల మొక్కల కోసం సిద్ధం చేసిన గట్టు

కశింకోట : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండ్ల మొక్కల పెంపకాన్ని చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ ద్వారపురెడ్డి రమణ సూచించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్ల మొక్కల పెంపకం మోడల్‌గా చేపట్టి యాజమాన్య పద్ధతులను మంగళవారం వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ భూమిలో గట్లను రెండు మీటర్లు వెడల్పు, రెండు అడుగుల ఎత్తు చేయాలన్నారు. వీటిపై ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్ని అనుసరించి పండ్ల మొక్కలు పెంచుకోవాలన్నారు. నిమ్మ, నారింజ, జామ తదితర పండ్ల జాతి మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా అందిస్తారని తెలిపారు. రైతులు కూడా తమ సొంత ఖర్చుతో వేసుకోవచ్చునన్నారు. దీని వల్ల చెట్లు ఫలసాయానికి వస్తే ఆరోగ్యకరమైన పండ్లు ఉత్పత్తి కావడంతోపాటు, అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

‘డ్రైనేజీల్లో పూడిక తొలగించండి’



ఎల్లయ్యకాలువలో చెత్తతో పూడుకుపోయిన మురుగునీటి కాలువ

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి, దోమల బారి నుంచి స్థానికులకు ఉపశమనం కలిగించాలని నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్(న్యూఢిల్లీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. స్థానిక నెహ్రూచౌక్ ఎల్లయ్య కాలువను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండేళ్లుగా పట్టణం మీదుగా ప్రవహించే నాలుగు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి, దుర్వాసన, దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయన్నారు. దీంతో పట్టణ ప్రజలు దోమకాటుకు గురై వ్యాధుల బారిన పడుతున్నారని ఆక్షేపించారు. తక్షణమే జోనల్ అధికారులు పూడికతీత చర్యలు చేపట్టాలని కోరారు.

యువత లక్ష్యంగా సోషల్ మీడియా మోసాలు



సమావేశంలో మాట్లాడుతున్న వియ్యపు రాజు

అనకాపల్లిటౌన్ : సోషల్ మీడియా ద్వారా యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని యాప్‌ల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వాటిని ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు కోరారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో రోజురోజుకీ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లు అశ్లీలత, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయన్నారు. ఈ యాప్‌లు అమాయక యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.కన్నబాబు, జిల్లా నాయకులు సాయి, ఆనంద్, తరుణ్ పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



మునగపాకలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న ఎఫ్ఎం బాబాయ్ దాడి త్రినాథస్వామికి అభినందన సత్కారంతో పాటు హైదరాబాద్‌కు చెందిన కళాకారులతో బరిబత్తల రాజు నాటిక ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కళారంగానికి మారుపేరుగా మునగపాక నిలుస్తుందన్నారు. కళాకారులను ప్రోత్సహించడం మునగపాక ప్రాంతీయులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరీపరమేశ్వరుల ఆలయ కమిటీ చైర్మన్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు



అమ్మవారి సన్నిధిలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవతల పండగలు ఘనంగా జరిగాయి. గవర్ల అనకాపల్లిలో గంగ పరదేశమ్మ తల్లిని భక్తులు దర్శించుకున్నారు. మునగపాకలో పరదేశమ్మతల్లి పండగ ఘనంగా జరిగింది.

ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.

కంచికామకోటి పీఠాధిపతికి పూజలు



శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీకి పాదపూజ చేస్తున్న భక్తులు

పాయకరావుపేట : కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి పట్టణంలో పూజలు నిర్వహించారు. అన్నవరం నుంచి నర్సీపట్నం వెళ్తూ పట్టణంలో సాహితీవేత్త కె.ఆర్.జె.శర్మ ఇంటికి స్వామీజీ వచ్చారు. ఈ సందర్భంగా శర్మతో పాటు కుటుంబ సభ్యులు స్వామిజీకి పాదపూజ చేశారు. తుని తపోవనం స్వామిజీ శ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామి, పలువురు స్వాములు కంచి పీఠాధిపతిని కలిశారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యానారాయణరాజు పాల్గొన్నారు.